# ప్రగతి పథంలో సిర్పూర్

- గూడెం వాగుపై వంతెన నిర్మాణం
- గ్రామాల్లో సీసీ, బీటీ, డ్రైనేజీల నిర్మాణం
- నియోజకవర్గంలో రూ.331.25 కోట్లతో అభివృద్ధి పనులు
- గడపగడకూ సంక్షేమ పథకాలు



చింతలమానేపల్లి మండలంలో గూడెం గ్రామం వద్ద నిర్మించిన అంతర్రాష్ట్ర వంతెన

కాగజ్‌నగర్, నవంబర్ 29 : సిర్పూర్ నియోజకవర్గం సీఎం కేసీఆర్ నేతృత్వంలో మంజూరు చేసిన నిధులతో సిర్పూర్ నియోజకవర్గం అభివృద్ధిపథంలో నిలిచిందని కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం నమస్తే తెలంగాణ విలేకరుతో ఆయన మాట్లాడుడారు. యువతతో పాటు వృద్ధులు, మహి ళలు, రైతులు అంత బీఆర్‌ఎస్‌కే మద్దతు తెలుపుతున్నారు. ఈ ఉత్సాహం తోనే బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని తెలుస్తుంది. గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి. నియోజకవర్గంలో వేల మందికి ఆసరా ఫింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా, తదితర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించా మన్నారు. దిక్కులేని వారికి పెద్ద కొడుకుగా, ఆడ బిడ్డలకు పెద్దన్నలా ఆదుకుంటున్నా కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. దేశంలో ఎక్కడ కూడా అమలు కాని పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంద న్నారు. కనీవిని ఎరుగని రీతిలో పథకాలు అమలు చేస్తూ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు. రాష్ట్రం ఆవిర్భావించాక అన్ని సమస్యలే ఎదురయ్యాయి.. ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరిస్తు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు అనుసంధాన రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం చేపట్టామన్నారు. ప్రజలకు దూర భారం తగ్గించడానికి నూతన మండలాలు, నూతన జిల్లాలు ఏర్పాటు చేసి పారదర్శకమైన సేవలు అందిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే సిర్పూర్ నియోజకవర్గం నంబర్ వన్ నియోజకవర్గమని గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా సిర్పూర్ నియోజకవర్గం సమస్యల్లోనూ నంబర్ వన్‌గానే ఉండేది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో వచ్చాక నియోజకవర్గం లోని చాలా సమస్యలు పరిష్కరించబడ్డాయి. ఎన్నికల వేళ వచ్చి లేని పోని చెప్పి ఓట్లు అడుగుతే ఇక్కడి ప్రజలు నమ్మరని చెప్పారు. ఎన్నికలు ఆయిపోయాక జాడ లేని లీడర్లు ఎవరో ప్రజల్లో ఉండి నిత్యం సేవలు చేసే లీడరు ఎవరో ప్రజలు గమనిస్తున్నారన్నారు. సిర్పూర్ ప్రజలు మూడుసార్లు అవకాశం ఇచ్చారు. వారికి తనుజీవితాంతం రుణపడి ఉన్నాను. నాలుగోసారి కూడా బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తారని సిర్పూర్‌ను మరింత అభివృద్ధి చేసి విద్యా వైద్య రంగంలో మరింత మెరుగైన సేవలు అందే విధంగా కృషి చేస్తానన్నారు. సిర్పూర్ మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో సొంత ఖర్చులతో పాటు దాతల సహకారంతో బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేశామని, మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటుకు అడు గులు పడుతున్నాయన్నారు. కోనేరు ట్రస్ట్ ద్వారా అందిస్తున్న నిత్యాన్నదానం, కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, సామూహిక వివాహాలు, తదితర సేవలు నిరంతరం అందిస్తునే ఉంటానని చెప్పారు. ఎంత సేవ చేసినా ఈ ప్రాంతం ప్రజల రుణం తీర్చుకోలేనని చెప్పారు.

**• నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి**

కాగజ్‌నగర్, నవంబర్ 29: సిర్పూర్ నియోజక వర్గంలో సిర్పూర్(టి), కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, దహేగాం, పెంచికలపేట్, కాగజ్‌నగర్ ఏడు మం డలాలు ఉన్నాయి. గతంలో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లలేని దుస్థితి ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం పదేళ్ల పాలనలో గ్రామాలకు రోడ్డు సౌకర్యం, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాగులు, ఒర్రెలపై వంతెనలు, కల్వర్టులు నిర్మించడంతో రవాణా సౌకర్యం మెరుగుప డింది. కాగజ్‌నగర్ మండలంలోని శివ పూరం–బారే గూడ, అందెల్లి బ్రిడ్జి, గజ్జీగూడ–మోసం రోడ్డు, సిర్పూర్ (టీ) మండలంలోని తాటిచెట్టు ఒర్రె, చింతకుంట, భూపాలపట్నం, హీరాపూర్ వంతెన, మాలి ని–వాంకిడి రోడ్డు, హుడ్కిలి వంతెన నిర్మాణం, కౌటాల మండలం లోని పార్డి–సాండ్‌గాం వంతెన, తాటిపల్లి వంతెన, గుండాయిపేట్–వైగాం, చింతల మానేపల్లి మండలం లోని కౌటాల–డబ్బా వంతెన, కో యపల్లి, గూడేం అంత రాష్ట్ర వంతెన, బెజ్జూర్ మండలంలోని ముంజంపల్లి, కుకుడ, సిద్దాపూర్, కుశ్నపల్లి, తాలాయి–సోమిని, సలు గుపల్లి, సులుగుపల్లి, సోమిని వంతెనలు, పెంచికలపేట్ మండలంలోని పోతేపల్లి, పెంచికలపేట్–దహేగాం మండలాల మధ్య వంతెన, కమ్మర్‌గాం–దిగిడ వంతెన, దహేగాం మండలంలోని ఎర్రవాగు గిరవెల్లి వం తెన, కొంచవెల్లి, తంగళ్లపల్లి, దేవాజీ గూడ, రాళ్లగూడ– కెస్ల పూర్, లింగాల వంతెనల నిర్మాణాలు జరిగాయి. సిర్పూర్ నియోజకవర్గంలో రూ.331.25 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి.



వివరాలు వెల్లడిస్తున్నఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కోట్నాక రఘునాథ్, ఎస్‌ఐ రమేశ్

## భారీగా నగదు పట్టివేత

**• రూ. 56లక్షల 48వేలను స్వాధీనం చేసుకున్న పోలీసులు**

సిర్పూర్(టీ), నవంబర్ 29: సిర్పూర్(టీ) మండలకేంద్రంలో వాహన తనిఖీల్లో భాగంగా బుధవారం సిర్పూర్(టీ) పోలీసులు భారీగా నగదును పట్టుకున్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి కోట్నాక రఘునాథ్, సిర్పూర్(టీ) ఎస్‌ఐ దీకొండ రమేశ్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండలకేంద్రానికి చెందిన షఫి ఉల్లా అనే ఆటో డ్రైవర్ ప్రతి రోజు టీఎస్ 20 టీ 2331 అనే నంబర్ గల ఆటోలో గూడ్స్ సరఫరా చేస్తారు. బుధవారం షఫీ ఉల్లాకు చెందిన ఆటోలో కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టీ)కు గూడ్స్‌ను తరలించే ఆటోలో ఫ్రీడం నూనె కాటన్‌లో నగదును తరలిస్తున్నారనే సమాచారంతో సిర్పూర్(టీ)లో వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఆటోలో ఉన్న ఫ్రీడం కాటన్‌ను తెరచి చూడగా అందులో ఏటువంటి ఆధారాలు లేని 56 లక్షల 48వేల రుపాయలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నగదును స్వాధీనం చేసుకొని, ఆటో డ్రైవర్ షఫీ ఉల్లాతో పాటు తంగడిపల్లి సంతోశ్, ముసావీర్‌లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

**• జైనూర్‌లో 14 కిలోల గంజాయి..**

జైనూర్, నవంబర్ 29: మండల కేంద్రంలోని కాలేజ్‌గూడలో బుధవారం షేక్ రహీం ఇంట్లో నిల్వ ఉంచిన 14 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై సం దీప్ కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారంతో పోలీసుల ఆధ్వర్యంలో ఆయన ఇంటికి వెళ్లి తనిఖీలు చేయగా గంజాయి లభించిందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని బాధితులు షేక్ రహీంతో పాటు కెరమెరికి చెందిన సయ్యద్ మైతాబ్‌ల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగించుకోవాలి

కౌటాల, నవంబర్ 29 : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కౌటాల సర్కిల్ సీఐ సాధిక్ పాషా తెలిపారు. కౌటాల సర్కిల్ పరిధిలోని కౌటాల, సిర్పూర్(టీ), చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల ప్రజలు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎక్కడ అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సర్కిల్ పరిధిలో ఒక డీఎస్పీ, 5 గురు సీఐలు, 5గురు ఎస్సైలు, సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు కలిపి 240 మంది పోలీసులు ఎన్నికల బందోబస్తులో విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌ల వద్ద ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసిన ట్లు, బెజ్జూర్‌లో ఒక డీఎస్పీ, ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలతో పాటు పోలీసులు బందోబస్తులో ఉంటారన్నారు. ప్రజలు శాంతియుతంగా తమ యొక్క ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి ఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

# ఎన్నికల సామగ్రి పంపిణీ

- ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- విధులకు తరలిన సిబ్బంది

కాగజ్‌నగర్, నవంబర్ 29 : కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెటి విద్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దీపక్ తివారీ ఆధ్వర్యంలో ఎన్నికల సామగ్రి బుధవారం పంపిణీ చేశారు. శాసనసభ ఎన్నికల్లో మొత్తం 226874 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు 112918, పురుషులు 113945, ఇతరులు 11 మంది తమ ఓటు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగ అందులో 45 సమస్యాత్మక, 39 మవోయిస్టు ప్రభవిత కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల్లో ఒక పీవో, ఒక ఏపీవోతో పాటు మరో ఇద్దరు సిబ్బంది ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఒక అడిషనల్ ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, పది మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 1200 కానిస్టేబుల్స్, హోంగార్డులను నియమించారు. ఎన్నికల సామగ్రి, సిబ్బందిని తరలించడానికి 20 ఆర్టీసీ బస్సులు, 40 మినీ బస్సులు, 35 టాటాఎస్‌లు, జీపులు మొత్తం కలిపి 107 వాహనాలు ఏర్పాటు చేసి తరలించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలకు ఎన్నికల సిబ్బంది ఆ వాహనాల్లో బయలుదేరారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రానికి రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు డీకే చౌదరి, రాహుల్ రంజన్, జిల్లా ఎస్పీ కె సురేశ్‌కుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనవకుండా ప్రతి ఒక్కరూ ఓటునువినియోగించుకోవాలని సూచించారు.

**• కౌటాల మండలంలో..**

కౌటాల, నవంబర్ 29: గురువారం జరగనున్నందున అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలో 34 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో 26,815 ఓటర్లు అందులో 13,644 పురుషులు, 13,170 మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో 169(కౌటాల) పోలింగ్ స్టేషన్ మోడల్ పోలింగ్ స్టేషన్‌గా, 176(విజయనగరం) మహిళా పోలింగ్ స్టేషన్‌లు కొత్తగా ఏర్పాటు చేసామన్నారు. ఎన్నికల విధుల్లో మొత్తం 7 రూట్‌లలో 7గురు రూట్ అధికారులతో పాటు 158 మంది సిబ్బంది పాల్గొనన్నుట్లు తెలిపారు. మండలంలోని ప్రతి ఓటరు తప్పకుండా వారి యొక్క అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే తమకు సమాచారం అందించాలని వారు కోరారు.

**• దహెగాం మండలంలో..**

దహెగాం,నవంబర్29: నేడు( గురువారం) జరుగనున్న అసెంబ్లీ ఎన్నిలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు తహసీల్దార్ కవిత తెలిపారు. మండలంలో 25992 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 13050, మహిళలు 12942 మంది ఓటర్లు ఉండగా వారికోసం 37 పోలింగ్ కేద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. 5రూట్లు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు ప్రశాతంగా ఓటును వినియోగించుకోవాలని కోరారు.



ఎన్నికల సామగ్రి కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు, ఎస్పీ సురేశ్ కుమార్



కాగజ్‌నగర్: ఎన్నికల సామగ్రితో బయలుదేరిన సిబ్బంది



కౌటాల 169 పోలింగ్ స్టేషన్‌ను మోడల్ పోలింగ్ స్టేషన్‌గా మార్చిన సిబ్బంది



దహెగాం: లగ్గాంలో ఏర్పాటు పూర్తి చేసిన పోలింగ్ కేంద్రం